# COMMUNIST PARTY OF INDIA (MARXIST)
# ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


**విజయవాడ,**
**తేది : 23 అక్టోబర్, 2017.**

**శ్రీయుత నారా చంద్రబాబునాయుడు గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

ఆర్యా!

**విషయం :** **శ్రీకాకుళం జిల్లా వంశధార ప్రాజెక్టు బాధిత ప్రజానీకానికి పునరావాస, పునర్నిర్మాణ ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని, అంతవరకు వారిని తమ నివాసాలనుండి వెళ్ళగొట్టవద్దని కోరుతూ...**

శ్రీకాకుళం జిల్లా వంశధార ప్రాజెక్టు రెండవ దశ పనుల మూలంగా దాదాపు 7,100 కుటుంబాలను ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు (పి.డి.ఎఫ్) గా ప్రభుత్వం గుర్తించినప్పటికీ వారిలో సగం మందికి కూడా పునరావాస పునర్నిర్మాణ ఏర్పాట్లను ఇప్పటికీ పూర్తి చేయలేదు. 14 పునరావాస కాలనీలను ప్రతిపాదించినా వాటిలో త్రాగునీరు, రోడ్లు మొదలుకొని స్మశానాల వరకు అవసరమైన ఏర్పాట్లు ఏ ఒక్క చోట కూడా సంపూర్ణం కాలేదు. అన్ని కాలనీల్లోనూ చట్టం పేర్కొన్న కనీస సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయి. కొన్ని చోట్ల నిర్వాసితులకు ఇంటి స్థలం పట్టా ఇచ్చినా మార్కింగ్ కూడా చేయలేదు. ఇక ఎలాంటి స్థలమూ చూపని వారు దాదాపు 2000 కుటుంబాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వాధికారులు గడువులు విధించి మరీ ప్రాజెక్టు ప్రభావిత ప్రజానీకాన్ని తమ నివాసాలనుండి బలవంతంగా వెళ్ళగొట్టడానికి పూనుకోవడం అమానవీయమే కాక చట్టవిరుద్ధం.

ఇప్పటికే గుర్తించిన పునరావాస కాలనీల్లో కనీస వసతులు కల్పించబడలేదు. రికార్డు దాఖలాగా ఏర్పాటు చేసినట్లున్నా అవి ప్రజోపయోగానికి పనికిరాని స్థితికి చేరుకున్నాయి. అందుకు సంబంధించిన కొన్ని వివరాలను కింద పేర్కొంటున్నాను.

**(1)** రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానం (జివో 68) నిబంధన 6.2 (ఎ) ప్రకారం ప్రతి నిర్వాసిత కుటుంబానికి 5 సెంట్ల ఇళ్ళ స్థలాన్ని కేటాయించవలసి వుండగా హిరమండలం మండలం గార్లపాడు గ్రామానికి చెందిన నిర్వాసితులకు కుటుంబానికి రెండున్నర సెంట్లు చొప్పున మాత్రమే కేటాయించారు. అది కూడా ఎక్కడో చూపలేదు.

**(2)** హిరమండలం ఆర్టీసి బస్టాండ్ వెనుకభాగంలో పునరావాస కాలనీ భూమి చాలా లోతట్టులో ఉంది. కనీసం దానిని మెరక కూడా చేయలేదు.

**(3)** సీతంపేట మండలం పులిపుట్టి ఆర్&ఆర్ కాలనీలో ప్లాట్లను మార్కింగ్ చేయలేదు. అంతర్గత రోడ్లు, ఒక సామాజిక భవనం నిర్మించారు తప్ప మిగిలిన సౌకర్యాలు లేవు.

**"త్రిప్పి చూడగలరు"**

**(4)** కొత్తూరు మండలం మెట్టూరు గ్రామంలో బిట్ 1, బిట్ 2, బిట్ 3 పేరిట ఏర్పాటు చేసిన పునరావాస కాలనీలో కనీసం త్రాగునీటి సౌకర్యం లేదు. ప్రభుత్వం నాసిరకంగా నిర్మించిన పాఠశాల ఇప్పటికే శిధిలావస్థకి చేరుకుంది. నీళ్ళలో మునిగి వుంది.

**(5)** కొత్తూరు మండలం కర్లెమ్మ ఆర్&ఆర్ కాలనీకి రోడ్లు, త్రాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు ఏర్పాటు చేసినా గ్రామానికి సింగిల్ ఫేజ్ విద్యుత్ సౌకర్యం వల్ల చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి. అంతర్గత రోడ్లు శిధిలావస్థకు చేరుకున్నాయి.

**(6)** ఎల్.ఎన్.పేట మండలం తాయిమాంబపురం ఆర్&ఆర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించినప్పటికీ నిర్వహణ లేక శిధిలావస్థకు చేరాయి. ఆ కాలనీకి 630 కుటుంబాలు రావాల్సి ఉండగా ఇప్పటికీ పూర్తి నివాసయోగ్యంగా వున్న ఇళ్ళు కేవలం 65 మాత్రమే. సుమారు 200 కుటుంబాలు మాత్రమే ఇళ్ళ నిర్మాణం ప్రారంభించారు.

పైన పేర్కొన్నవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. క్షేత్రస్థాయిలో నిర్వాసితులు పడుతున్న, పడనున్న ఇక్కట్లు అనేకం. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం త్వరితగతిన చర్యలు చేపట్టి అన్ని పునరావాస కాలనీల్లో త్రాగునీరు, విద్యుత్, అంతర్గత రోడ్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలి. ఇప్పటికే కల్పించినట్లు రికార్డుల్లో ఉన్నప్పటికీ ఆచరణలో వినియోగానికి పనికిరాని స్థితిలో వున్న వాటిని పునరుద్ధరించాలి. అవసరమైన వాటిని పునర్నిర్మించాలి. అదే విధంగా పాఠశాల, గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ సెంటరు, పోస్టాఫీసు తదితర ప్రభుత్వ సంబంధిత సేవా కార్యాలయ భవనాలు నిర్మించాలి. ప్రజలందరికీ ఉపయోగపడే స్మశానం, సామాజిక భవనం, ప్రార్ధనా స్థలాలు, గ్రామ చావిడి వంటివి ప్రతి కాలనీకి తప్పక ఏర్పాటు చేయాలి. ఆ తరువాతనే నిర్వాసితులను తరలించాలి.

ఇప్పటికైనా ప్రభుత్వం ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం అన్ని విధాల పరిహారాలను అందజేయాలని కోరుతున్నాము. వంశధార ప్రాజెక్టు బాధిత ప్రజానీకానికి పునరావాస, పునర్నిర్మాణ ఏర్పాట్లు పూర్తయ్యేంతవరకు బలవంతంగా వారిని తమ నివాసాలనుండి వెళ్ళగొట్టవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం.

**(పెనుమల్లి మధు)**

రాష్ట్ర కార్యదర్శి